ప్రజాశక్తి
మంగళవారం 27 మే 2025 | 5 | అనంతపురం

గుంతకల్లులో ప్రజాపోరు యాత్రను ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

సాగునీరివ్వరు.. సంక్షేమాన్నీ వర్తింపజేయరు..!

- తీరని తాడిపత్రి బ్రాంచ్‌కెనాల్ రైతుల అవస్థలు
- నీరు లేక బీడుగానే పొలాలు
- రేషన్‌కార్డులివ్వకుండా నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు

అనంతపురం జిల్లా పరిధిలోని తాడిపత్రి బ్రాంచ్ కెనాల్(టిబిసి) రైతుల కష్టాలు తీరడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్పా వీరి సమస్యలు మాత్రం తీరడం లేదు. సాగునీరు అందించి పొలాలను సాగులోకి తేవాల్సిన ప్రభుత్వాలు ఆ దిశగా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఈ కెనాల్ పరిధిలోని భూములు సాగునీటి భూములుగా నమోదు కావడంతో ఐదు ఎకరాలు పైబడిన రైతులకు రేషన్‌కార్డులు ఇవ్వడం లేదు. దీంతో వీరు ప్రభుత్వ పథకాల సంక్షేమ లబ్ధికి దూరం అవుతున్నారు. ఓ వైపు సాగునీరు లేక.. మరోవైపు ప్రభుత్వ సంక్షేమం అందక టిబిసి రైతులు కష్టాలను చవిచూస్తున్నారు.

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

జిల్లాకు సాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో కర్నాటక రాష్ట్రం తుంగభద్ర డ్యామ్ నుంచి హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సిలను ఏర్పాటు చేశారు. హెచ్ఎల్‌సి (హై లెవెల్ కెనాల్) జిల్లాలో పెనకచర్ల వద్ద నిర్మించిన మిడ్ పెన్నార్‌లో కలుస్తుంది. హెచ్ఎల్సీ కింద అనంతపురం జిల్లాకు నీటి సరఫరా చేసే ఏర్పాటు చేశారు. వీటికి అనుసంధానంగా నిర్మించిన సుబ్బరాయ సాగర్ నుంచి తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు మండలాలకు సాగునీరు అందేలా తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌ను నిర్మించారు. తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ మూడు మండలాలు, 13 డిస్ట్రిబ్యూటర్లు పరిధిలో 28 వేల ఎకరాల సాగునీటి విస్తీర్ణం కలిగి ఉంది. దీని పరిధిలో ఉన్న రైతులకు ప్రతి సీజన్‌కు 90 రోజుల పాటు సాగునీరివ్వాలనే నిబంధన ఉన్నా అది అమలు కావడం లేదు.

ఐదెకరాలు పైబడిన వారికి రేషన్‌కార్డు కట్

తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ పరిధిలో ఐదు ఎకరాలు పైబడిన రైతులకు ఆరుతడి కింద భూములు ఉన్నాయంటూ ఆన్‌లైన్‌లో రికార్డులు ఉన్నాయి. సాగునీటి వినియోగం కింద ఉన్న భూములుగా రికార్డుల్లో నమోదు కావడంతో దీని పరిధిలోని రైతులకు రేషన్ కార్డులు ఇవ్వడం లేదు. రేషన్‌కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం అందించే పలు రకాల సంక్షేమ పథకాలకు వీరంతా దూరం అవుతున్నారు. తాడిపత్రి మండలంలోని పెద్దపడమల, చిన్నపడమల, కోమలి, చిన్నపల్లి, ఎర్రగుంటపల్లి, రావి వెంకటంపల్లి, తిమ్మాపురం, తెరన్నపల్లి, ఎగువపల్లి, దిగువపల్లి, కొనగుంటపల్లి రైతులు ప్రభుత్వ పథకాలు నోచుకోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి అర్జీల రూపంలో తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. కూటమి ప్రభుత్వం అయినా తమ సమస్యపై దష్టి సారించాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు. కాలువలకు నీళ్లైనా వదలండి.. లేదా రేషన్ కార్డు అందించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ పరిధిలోని రైతులు కోరుతున్నారు.

పుట్లూరు మండలంలో ఉన్న సుబ్బరాయ సాగర్

అధికారులకు విన్నపాలు

తాడిపత్రి బ్రాంచ్‌కెనాల్ పరిధిలోని రైతులు పలుమార్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌కు ప్రతి సీజన్‌లో 90 రోజులు నీళ్లు వదలాలని ఉన్నా అలా నీరిచ్చిన దాఖలాలు లేవు. సాగునీరు ఇవ్వని నేపథ్యంలో భూములు ఆరుతడి కింద ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రైతులు కోరుతున్నారు. తహశీల్దార్ స్థాయి నుంచి జిల్లా అధికారుల వరకు ఈ సమస్యను రైతులు విన్నవించినా ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు.

కూటమి ప్రభుత్వం స్పందించాలి

టిబిసి కాలువ కింద ఉన్న ఐదు ఎకరాలు పైబడి ఉన్న రైతులకు రేషన్ కార్డులు ఇవ్వడం లేదు. కాలువకూ నీరు ఇవ్వలేదు. ఓ వైపు పంటల సాగు లేక, మరోవైపు రేషన్‌కార్డులు లేక సమీప గ్రామాల రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఇక్కడి రైతుల సమస్యలను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌ను పరిశీలించి, ప్రతి సీజన్‌కు 90 రోజులు నీళ్లు వదిలేలా చర్యలు తీసుకోవాలి. అక్కడి రైతులకు వెంటనే రేషన్ కార్డులను అందించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి.

రాజారామిరెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి.

భారాలు మోపేందుకే సర్వేలు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-గుంతకల్లు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మున్సిపాల్టీల్లో పన్నుల రూపంలో ప్రజలపై అదనపు భారాలు వేసేందుకు సర్వేలను చేపడుతోందని, ఇలాంటి వాటిని ప్రజలు అడ్డుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు యాత్ర సోమవారం ప్రారంభం అయ్యింది. పట్టణంలోని 24, 25వ వార్డుల్లో యాత్రను నల్లప్ప ప్రారంభించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న 123 పట్టణ ప్రాంతాల్లో ప్రజలపై రూ.463 కోట్ల ఆస్తి పన్ను భారం మోపేందుకు మున్సిపాల్టీలకు జీవోలు జారీ చేసిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం ప్రతి ఏడాదీ ఆస్తి పన్ను 15 శాతం పెంచేలా జీవో ఇచ్చిందన్నారు. ఈ విధానాన్ని రద్దు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్నా ఈ జీవో రద్దు కాలేదన్నారు. ఆజీవోను రద్దు చేయకపోగా అదనంగా రాష్ట్ర ప్రజల మీద 20 శాతం భారం మోపే చర్యలకు ఉపక్రమించిందన్నారు. అందులో భాగంగానే పట్టణంలో ఇళ్లు, ఖాళీ స్థలాలను కొలతలు వేసేలా అధికారులు సర్వేలు చేసేందుకు సిద్ధం అయ్యారన్నారు. ఇంట్లో సొంత ఉపాధి కోసం చిన్నపాటి దుకాణం పెట్టుకున్నా వాణిజ్య పన్ను కిందికి మార్చేస్తున్నారని తెలిపారు. జూన్ నెల నుంచి మున్సిపల్, సచివాలయాల అధికారులు సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వేలు చేపడతారన్నారు. పట్టణ ప్రజల మీద అదనపు భారాలు మోపే ఈ సర్వేలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, కార్యదర్శి వర్గ సభ్యులు సాకే నాగరాజు, సురేంద్రబాబు, రంగమ్మ, పట్టణ కమిటీ సభ్యులు తిమ్మప్ప, ఓబులేసు, అబ్దుల్లా, షాషా, రాము నాయక్, జయమ్మ, ఖాదర్ బాషా, డేనియల్, ఈరన్న, నాగరాజు, ప్రభాస్, సరస్వతి పాల్గొన్నారు.

వేగవంతంగా భూసేకరణ

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు భూబదలాయింపు, భూసేకరణ పనులను ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించి భూబదలాయింపు, భూసేకరణ ప్రక్రియపై సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏపీఐఐసీ పరిధిలో ఎంఎస్ఎంఈ పార్కులు, నెడ్‌క్యాప్ పరిధిలో ప్రాజెక్ట్ లు, ఆయిల్ ఫెడ్, డంపింగ్ యార్డ్, కాపు భవన్, బీసీ భవన్, వైశ్య భవన్, టెలి కమ్యూనికేషన్, ఈఎస్ఐ డిస్పెన్సరీ, ఎన్‌హెచ్ 544డి జాతీయ రహదారి, తదితర ప్రాజెక్టుల కోసం భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయిలో సమస్యలు ఎక్కడ వచ్చినా సలహాలు తీసుకుని పనులను పూర్తి చేయాలన్నారు. కౌలు రైతులకు అందించే సిసిఆర్‌సి కార్డులకు సంబంధించి జిల్లాకు 8,500 కార్డులు అందజేయాలని లక్ష్యం విధించగా ఇప్పటివరకు 27 కార్డులను మాత్రమే అందించారని చెప్పారు. అనుకున్న లక్ష్యం మేరకు ఈ కార్డులను అందించే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశానికి ముందు ఏపీఐఐసీ, రైల్వే, సోలార్ ప్రాజెక్టులకు సంబంధించి జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ ఎ.మాలోల, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియజుద్దీన్, డిటిలు కిరణ్, శ్రీనివాస్, సురేఖ, ఎన్‌హెచ్ పీడీ తరుణ్ కుమార్, సైట్ ఇంజినీర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పూర్తిపై ప్రత్యేక దృష్టి

ఉపాధి హామీ కింద చేపడుతున్న పనుల పూర్తిపై ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఉపాధి హామీ పథకంపై డ్వామా పీడీ, ఎంపీడీవోలు, ఏపీడీలు, ఏపీఎం, ఆయా శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి పురోగతి తక్కువగా ఉందని, ఈ పనుల్లో వేగం పెంచాలన్నారు. మిగా పనులనూ అనుకున్న లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డ్వామా పీడీ సలీమ్ బాషా, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, పంచాయతీరాజ్ ఎస్ఈ జహీర్ అస్లాం పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో అర్జీలను పరిశీలించండి : కలెక్టర్

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-తాడిపత్రి

వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. తాడిపత్రి మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. తాడిపత్రి ఎమ్మెల్యే జెసి.అస్మిత్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి 364 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఒ ఏ.మాలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ జి.రామకష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్‌లు రామ్మోహన్, మల్లికార్జున వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పరిష్కార వేదికలో 70 నుంచి 80 శాతం భూ సంబంధిత సమస్యలు, సర్వే, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖలకు సంబంధించిన అర్జీలు వస్తున్నాయన్నారు. ఇలాంటి వాటిని పరిశీలించి పరిష్కరించే అవకాశాలను వెతకాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, జెడ్పీ డిప్యూటి సీఈవో రామసుబ్బయ్య, డిసిఒ అరుణకుమారితో పాటు జిల్లా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎండియు వాహనదారుల నిరసన మోత

తమ సర్వీసులను కొనసాగించాలంటూ ర్యాలీ - కలెక్టరేట్లో వినతి పత్రం అందజేత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా ప్రజలకు నిత్యావసర సరుకులు ఇంటి వద్దకే పంపిణీ చేసిన మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యునిట్ (ఎండియు) వాహనదారులు తమ సర్వీసులను కొనసాగించాలని నిరసన మోత మోగించారు. ఎండియు వాహనదారుల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. నవోదయ కాలనీ నుంచి ఎండియు వాహనాలు సైరన్‌తో ర్యాలీగా బయలుదేరి విద్యుత్ నగర్ సర్కిల్, అరవింద నగర్, కోర్టు రోడ్, టవర్‌క్లాక్ సర్కిల్, సప్తగిరి సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేపట్టారు. తమకు న్యాయం చేయాలంటూ వాహనదారులు నినాదాలు చేశారు. కలెక్టరేట్ వద్ద వాహనాలు నిలిపి కలెక్టరేట్ గేటు ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎండియు వాహనదారుల యూనియన్ జిల్లా అధ్యక్షులు సాకే రామాంజినేయులు, జిల్లా కార్యదర్శి అంజన్‌రెడ్డిలు మాట్లాడుతూ ఎండియు వాహనాల ద్వారా నాలుగు సంవత్సరాలుగా ఎలాంటి సమస్యలు లేకుండా ప్రజలకు ఇంటి వద్దకే వెళ్లి సరుకులు పంపిణీ చేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తమకు ఎలాంటి గడువు ఇవ్వకుండా తొలగించామంటూ ఉత్తర్వులు ఇవ్వడం అన్యాయంగా ఉందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎండియు సర్వీసులపై పునరాలోచించాలన్నారు. వాహన సర్వీసులు భారంగా మారితే తమను ఇతర ప్రభుత్వ విధులకైనా వినియోగించుకుని ఉపాధి చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండియు యూనియన్ నాయకులు గుత్తి కాశీం, కంబదూరు రమేష్, తాడిపత్రి కమలాకర్, శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలతో నిరసన ప్రదర్శన చేస్తున్న ఎండియు వాహనదారులు

31 నుంచి ప్రత్యేక శిబిరాలు

పోస్టల్ చీఫ్ సూపరింటెండెంట్ కె.ఆదినారాయణ

ప్రజాశక్తి-అనంతపురం

పోస్టాఫీసుల్లో సేవింగ్ ఖాతాలు తెరుచుకునేందుకు ఈనెల 31 నుంచి జూన్ 4వతేదీ వరకూ గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్టు అనంతపురం సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ కె.ఆదినారాయణ తెలిపారు. సోమవారం అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ ఉమా మహేశ్వరరావుతో కలిసి మీడియాతో మాట్లాడుతూ శిబిరాల్లో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతాలను తెరవడం, ఇప్పటికే ఉన్న ఖాతాలకు ఆధార్ లింక్ చేయడం ద్వారా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మ్యాపింగ్ చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 13,480 లబ్ధిదారులకు ఎన్‌పిసిఐ లింకు అవ్వని ఖాతాలు ఉన్నాయన్నారు. ఆయా ఖాతాలకు పోస్టల్ ఉద్యోగులతో ఆధార్ సీడింగ్ ద్వారా ఎన్‌పిసిఐ లింక్ చేయనున్నట్లు తెలిపారు. అలాగే 18ఏళ్లు నిండిన వారు సేవింగ్ ఖాతాలను తెరుచుకోవాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

'పసుపు సైన్యం' బలం చూపిద్దాం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రతిపక్ష హోదా లేకపోయినా ప్రతిపక్ష నాయకుడిగా చెప్పుకునే పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి ఇలాకాలో జరిగే టిడిపి మహానాడు ద్వారా పసుపు సైన్యం బలం ఏంటో చూపిద్దామనిఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే మహానాడుకి సంబంధించి ఆయన అర్బన్ నియోజకవర్గ నాయకులతో సోమవారం వరుస సమావేశాలు నిర్వహించారు. ఉదయం అర్బన్ టీడీపీ కార్యాలయంలో, మధ్యాహ్నం నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆర్.అండ్.బి అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ నియోజకవర్గం మహానాడుకు కేవలం 14 గంటల ముందు పిలుపునిస్తే 6 వేల మంది హాజరై దిగ్విజయం చేశారన్నారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో జగన్ రెడ్డి ఇలాకాలో జరిగే మహానాడును కూడా విజయవంతం చేద్దామన్నారు. గతంలో విశాఖపట్నంలో మహానాడు జరగడం వలన చాలా మంది వెళ్లలేకపోయారని ఈసారి మనకు దగ్గరలో ఉన్న కడపలో మహానాడు జరుగుతున్నందున నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున హజరు కావాలన్నారు. ఇందుకోసం 120 బస్సులు, వంద కార్లు, ఇతర వాహనాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే 8 వేల మంది వరకు వచ్చేలా ప్రణాళికలు చేసినట్టు చెప్పారు. మహానాడుకు హాజరయ్యే కార్యకర్తలు, నాయకులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు గదులు, భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో ముఖ్యనాయకుల సమావేశాలు మాత్రమే ఉంటాయన్నారు. కాబట్టి డివిజన్‌లో కీలక నాయకులు, పార్టీ పదవుల్లో ఉండే నాయకులు మాత్రమే హాజరు కావాలన్నారు. ఈ నెల 29న మాత్రం ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమానికి రావాలన్నారు. మహానాడుకు వెళ్లే ప్రతి కార్యకర్త మెడలో టిడిపి సభ్యత్వ కార్డు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మహానాడు సమన్వయకర్త ఆకాశాపు స్వామి, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నియోజకవర్గ పరిశీలకుడు లక్ష్మీనారాయణ, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖలో బదిలీల జాతర

వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ సమక్షంలో కౌన్సిలింగ్ - రాత్రి అయినా కొనసాగిన పక్రియ

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి రాయలసీమ జిల్లాలోని మండల వ్యవసాయ అధికారులకు డివిజన్ వ్యవసాయ అధికారులకు సీనియర్ అసిస్టెంట్లు సూపరింటెండెంట్ల బదిలీల ప్రక్రియ స్థానిక జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ శ్రీధర్ సమక్షంలో సోమవారంనిర్వహించారు. ఐదేళ్లు దాటిన వారు, బదిలీలు కోరుకునే ఉద్యోగులు ఆన్‌లైన్‌లో తమ ఆప్షన్ ఇచ్చుకున్నప్పటికీ కౌన్సిలింగ్ ప్రక్రియలో అవి కనిపించని పరిస్థితి నెలకొందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. మాన్యువల్‌గా ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఉమ్మడి రాయలసీమ జిల్లా వ్యవసాయ అధికారులు పర్యవేక్షణలో ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతోందని అంటున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్ 11 గంటలకు ప్రారంభమైంది. ఉమ్మడి రాయలసీమ జిల్లాలోని జోన్ 4 పరిధిలో సుమారు 240 మంది పైబడి సిబ్బంది కౌన్సిలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. మొదటగా సూపరింటెండెంట్ ఏడు పోస్టులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం 46 మంది సీనియర్ అసిస్టెంట్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇందులో 31 మంది ఐదు సంవత్సరాలు పైబడి సర్వీస్ పూర్తి చేసుకున్న వారు ఉండగా మరో 15 మంది రిక్వెస్ట్ ట్రాన్స్ఫర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటినన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలించిన మీదట బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఉదయం వేగవంతంగా సాగినా డివిజన్ స్థాయి వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ అధికారుల కౌన్సిలింగ్ మాత్రం ప్రహసంగా జరిగింది. ఉద్యోగులు ఆన్‌లైన్‌లో ఇచ్చుకున్న ఆప్షన్లు పూర్తిగా తీసివేసి వాటి స్థానంలో వారు కోరుకోని మండలాలు, డివిజన్‌లు కనిపించడంతో సిబ్బంది ఆందోళన గురయ్యారు. దీంతో సమస్యలను జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రాముడు, వెంకట్ కుమార్, వాసుప్రకాష్ కౌన్సిలింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మాన్యువల్‌గానే కౌన్సిలింగ్ జరిగింది. ఉద్యోగులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్‌లో ఇచ్చిన ఆప్షన్లను ప్రింట్ తీసుకుని కౌన్సిలింగ్‌లో హాజరైన స్థానాలనే పరిగణలోకి తీసుకుంటామని అధికారులు చెప్పడంతో సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా తిరుపతి అన్నమయ్య రాయచోటి కడప జిల్లాలో చెందిన అధికారులు పెద్ద ఎత్తున ఈ కౌన్సిలింగ్ ప్రక్రియకు హాజరు కావడంతో వారికి భోజన సౌకర్యం కూడా వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసింది. ఎక్కువమంది అధికారులు వారికి కావాల్సిన స్థానాల కోసం ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలు తీసుకురావడం కనిపించింది. రిక్వెస్ట్ ట్రాన్స్ఫర్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు అందుకు సంబంధించిన పత్రాలు కూడా కౌన్సిలింగ్ అధికారులు ఎదుట పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అనంతవరం జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, సత్యసాయి జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు అన్నమయ్య, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్, కడప జిల్లా వెంకటేశ్వర్లు, పరిపాలన అధికారులు సుజాత, ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్లు కృష్ణయ్య, రహంతుల్లా, చంద్రశేఖర్‌రెడ్డి, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని కౌలు రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మహబూబ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ కింద రూ.రూ20వేలు అందజేయాలన్నారు. అలాగే విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని, కౌలు రైతులకు ఆరు ప్యాకెట్ల విత్తన వేరుశనగ కాయలు ఇవ్వాలన్నారు. భూమిలేని నిరుపేదలకు గతం నుంచి సాగులో ఉన్నవారికే ఆలయ భూములను కౌలుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇకపోతే శ్రీరామిరెడ్డి సత్యసాయి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను వెంటనే ఆపి 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేసి పిల్ల కాలువలను ఏర్పాటు చేసి చివరి ఆయకట్టు వరకూ తాగు, సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాల రంగయ్య, నియోజకవర్గ అధ్యక్షులు సురేష్, కార్యదర్శి వెంకటేసులు, సంఘం కమిటీ నాయకులు రామ్మూర్తి, నారాయణస్వామి, ఆంజనేయులు, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ మహబూబ్‌బాషాకు వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు సావిత్రమ్మ

ప్రజాశక్తి-ఆత్మకూరు

రాప్తాడు నియోజకవర్గంలో బోర్లు ఎండిపోకుండా భూగర్భజలాలు పెరగాలంటే హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను తక్షణం ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు సావిత్రమ్మ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటికే రైతాంగం చేసిన అప్పులు తీర్చలేక పంటలను కాపాడుకునేందుకు రైతులు లక్షలు ఖర్చు చేసి బోర్లు వేసుకుంటున్నా నీరు పడని పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భూగర్భజలాలు పెరగాలంటే హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపాలన్నారు. అదేవిధంగా గొర్రెలు, పశువులకు నీరు లభించకుండా పోతుందన్నారు. అదేవిధంగా గత 12 సంవత్సరాల నుంచి పిల్ల కాలువలు ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కాలువ లైనింగ్ పనులను ఆపాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్, నాయకులు రాము, రాజేశ్వరి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కక్షసాధింపు రాజకీయాలు

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్షసాధింపు రాజకీయాలు ఎక్కువయ్యాయని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి అరెస్టుపై స్పందించిన ఆయన ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర లేపుతున్నారన్నారు. ఇందులో భాగంగానే కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్టు చేశారన్నారు. అధికారం ఉందని అక్రమ కేసులు పెడుతూ పాలనను గాలికొదిలేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని పట్టించుకోకుండా, యదేచ్ఛగా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, రిటైర్డ్ అధికారులందరినీ అరెస్టు చేస్తున్నారన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదన్నారు. రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. అక్రమ అరెస్టులు, కేసులపై న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పారిశుధ్యం పనులను పరిశీలిస్తున్న కమిషనర్ బాలస్వామి

రోజువారి పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను కమిషనర్ బాలస్వామి సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా రామ్‌నగర్, కోర్టు రోడ్డు, టవర్‌క్లాక్, ఆర్ట్స్ కళాశాల, సుభాష్ రోడ్డు, సాయినగర్, అశోక్‌నగర్, విద్యుత్‌నగర్, ఆర్‌టిఒ కార్యాలయ వద్ద రోడ్లలో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. తర్వాత హమాలీ కాలనీ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వీధిలో చెత్త సేకరణ పనులను పరిశీలించారు. నగరంలోని కమర్షియల్ ప్రాంతాల్లో రోజూ సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకూ దుకాణాల నుంచి చెత్త సేకరణ చేయాలని శానిటరీ ఇన్స్‌పెక్టర్లను ఆదేశించారు. అదేవిధంగా నగరంలోని ప్రతి దుకాణదారుడు చెత్త బుట్టను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకుని నగరపాలక సంస్థ వాహనం వచ్చినప్పుడు ఇచ్చేవిధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. తర్వాత పాతూరు అన్న క్యాంటీన్‌లో అల్పాహార పంపిణీని పరిశీలించారు. ఆహార నాణ్యతపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

'సేవ్ ఆర్డీటీ'ని జయప్రదం చేద్దాం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త తలారి రంగయ్య.

సేవ్ ఆర్‌డిటి కార్యక్రమాన్ని అందరం జయప్రదం చేద్దామని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎంపి తలారి రంగయ్య పిలుపునిచ్చారు. ఈమేరకు బెళుగుప్ప మండలంతోపాటు బ్రాహ్మణపల్లి తండా, నరసాపురం, కుర్లపల్లి గ్రామాల్లో పర్యటించి సేవ్ ఆర్డీటీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సేవ్ ఆర్డీటీ పాదయాత్ర రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిపి కంభం చంద్రశేఖర్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి చామలూరు రాజగోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు కోనాపురం గంగాధరప్ప, జిల్లా కమిటీ అనుబంధ సంఘాల నాయకులు ఎర్రంపల్లి కృష్ణమూర్తి, గోపాల్‌రెడ్డి, మంజు, తాలూకా కార్మిక విభాగం అధ్యక్షుడు తలారి సంజీవయ్య, రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు పార్టీల అభిలాష్‌రెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సర్ థామస్ మన్రోకు నివాళి

ప్రజాశక్తి-గుత్తి

సర్ థామస్ మన్రోకు నివాళులర్పిస్తున్న దృశ్యం

దార్శనికుడు, పరిపాలనాదక్షుడు సర్ థామస్ మన్రో అని గుత్తి కోట పరిరక్షణ కమిటీ అధ్యక్షులు బి.ఇస్మాయిల్, ప్రజా సైన్స్ వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.సురేష్‌బాబు అన్నారు. జిల్లా మొట్టమొదటి కలెక్టర్ సర్ థామస్ మన్రో 264వ జయంతిని సోమవారం గుత్తిలో గుత్తి కోట పరిరక్షణ కమిటీ, ప్రజాసైన్స్ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గుత్తి కోట వద్ద ఉన్న ఆయన సమాధి వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్రో రాయలసీమ భగీరథుడు అన్నారు. దక్షిణ భారతదేశంలో ఆధునిక పరిపాలన కొనసాగించి ప్రజల గుండెల్లో మన్రో నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా రేడియో ప్రాంతీయ సంచాలకులు ప్రొఫెసర్ జి.వెంకటశివారెడ్డి, నాగసూరి వేణుగోపాల్, గుత్తి కోట పరిరక్షణ కమిటీ నాయకులు వరిగడ్డి షేక్షావలి, రఫీ, రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి-తాడిపత్రి

కలెక్టర్, ఎమ్మెల్యేకు సమస్యలను వివరిస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పలువురు జర్నలిస్టులు కోరారు. ఈమేరకు సోమవారం తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డికి తాడిపత్రి జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. పాత్రికేయుల పిల్లలకు ఉచిత విద్య అందివ్వాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు ఉన్నప్పటికీ కొన్ని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు అమలు చేయడం లేదన్నారు. అలాగే అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. ఇందుకు స్పందించిన కలెక్టర్, ఎమ్మెల్యే ఆయా సమస్యలకు తప్పకుండా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విలేకరులు ప్రజాశక్తి వెంకటరామిరెడ్డి, కన్నా, నాగరాజు, ఎర్రిస్వామి, మధుకుమార్, పుల్లయ్య, మధు, వినోద్, రామాంజి, రామ్మోహన్, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

నేడు పుట్లూరులో యోగాంధ్ర

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అధికారులు, శివాలయ సిబ్బంది, మండల ప్రజలు, తదితరులు హాజరుకావాలని కోరారు.

'యోగాంధ్ర'లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-తాడిపత్రి

యోగా చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

యోగాంధ్ర క్యాంపెయిన్‌లో రాష్ట్రంలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. యోగాంధ్ర-2025లో భాగంగా సోమవారం ఉదయం తాడిపత్రిలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించిన సామూహిక యోగాలో కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో యోగాసనాలు వేయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని పురాతనమైన బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద యోగాంధ్ర కార్యక్రమాన్ని మంచి ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిచినట్లు తెలిపారు. మంచి ఆలోచనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాంధ్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయన్నారు. కావున ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. అనంతరం బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లిన కలెక్టర్‌కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం బుగ్గ రామలింగేశ్వర స్వామి, పార్వతీదేవి, శ్రీరామచంద్రమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. తర్వాత ఆలయ పూజారులు కలెక్టర్‌కు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ మాలోల, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ తలారి అరుణ, షేక్షావలి, ఆర్డీఒ కేశవనాయుడు, ఎస్డిసి మల్లికార్జునుడు, డిఐపిఆర్‌ఒ పి.గురుస్వామిశెట్టి, డిఎంహెచ్‌ఒ ఈబి దేవి, జిల్లా టూరిజం అధికారి జయకుమార్‌బాబు, డ్వామా పీడీ సలీంబాషా, ఎంపిడిఒ ఫజిల్, ఇఒఆర్‌డి వెంకటేష్, జనసేన నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, వివేకానంద యోగా సెంటర్ గురువు వై.ఆంజనేయులు, యోగా సెంటర్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, యోగా గురువు శ్రీనివాసులు, తదితరలు పాల్గొన్నారు.

మహిళలకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయండి

గూగూడు ఉత్సవాలపై ఎంపి, ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి-నార్పల

సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

మండల పరిధిలోని గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో మహిళలకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలని గూగూడు సర్పంచు రమణకుమారి శివయ్య కోరారు. జూన్ 27వతేదీ నుంచి గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులకు కల్పించే సౌకర్యాలు, ఏర్పాట్లపై మండలంలోని వివిధ శాఖల అధికారులు, దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరై పలు అంశాలపై చర్చించారు. ముందుగా ఎంపి, ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆంజనేయస్వామి, కుళ్లాయిస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమీక్షలో కుళ్లాయిస్వామి దర్శనంలో మహిళలు, పురుషులు ఇద్దరికీ ఒకే క్యూలైన్ ఉండటంతో ప్రతి ఏడాది మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సర్పంచు ఎంపి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈఏడాది మహిళలకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా తాత్కాలిక స్నానం గదులు, మరుగుదొడ్లు, భక్తులకు వసతులు కల్పించాలన్నారు. అదేవిధంగా గూగూడులో బ్రహ్మోత్సవాల ముగిసేంత వరకూ గ్రామంలో మద్యం అమ్మకాలు నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, మాజీ ఎంపిపి ఆకుల అరుణ, మాజీ ఎంపిటిసి ఆకుల ఆంజనేయులు, టిడిపి నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల విజయ్‌కుమార్ (బాబు) ప్రతాప్ చౌదరి, దారపునేని చంద్రబాబు, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు జాఫర్‌వలి, పిఎల్ లక్ష్మీనారాయణ, మాజీ ఎంపిటిసి రాజన్న, తహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఒ భాస్కర్, సర్పంచు రమణకుమారి శివయ్య, కార్యనిర్వాహణాధికారి సాకేతపురం శోభ, ఇఒఆర్‌డి శైలజారాణి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ జ్యోతిరాణి, ఆలయ అర్చకుడు హుస్సేనప్ప, సీఐ కౌలుట్లయ్య, ఎపిఎం తిప్పమ్మ, ఎపిఒ ఎర్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అక్కమ్మ గార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే

మండల పరిధిలోని వెంకటాంపల్లి గ్రామంలో జరుగుతున్న అక్కమ్మ పరుషలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

రుద్రంపేటలో సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

అనంతపురం రూరల్ పంచాయతీ పరిధిలోని రుద్రంపేట పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నగర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో రుద్రంపేట పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ రుద్రంపేట పంచాయతీలో గత కొన్నేళ్లుగా పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా కాలనీలో ప్రజలకు తాగడానికి సాయిబాబా నీరు ఇవ్వాలని, పివికెకె కళాశాల వెనుకవైపు ఉన్న హాస్టల్లో నుంచి డ్రెయినేజీ నీరు బయటకు వస్తుండటంతో దుర్వాసన వెదజల్లి స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. అలాగే చైతన్య కాలనీకి వెళ్లడానికి ప్రధాన రోడ్డు ఏర్పాటు చేయాలని, విమల ఫారుక్‌నగర్ మెయిన్ రోడ్డులో ఉన్న సైడ్ కాలువలో చికెన్ వేస్తు వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అజయ్ ఘోష్ కాలనీలో పోలేరమ్మ గుడి దగ్గర కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రుద్రంపేట పంచాయతీ సెక్రటరీ హిదాయతుల్లాకు వినతిపత్రం అందజేశారు. ఇందుకు పంచాయతీ సెక్రటరీ స్పందిస్తూ ఆయా సమస్యలను వీలైనంత త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ఇర్ఫాన్, లతీఫ్, రుద్రంపేట పంచాయతీ సిపిఎం నాయకులు షేక్ అజాంబాషా, ఆదినారాయణ, కృష్ణవేణి, గఫూర్, వులిగప్ప, ఆది, నల్లప్ప అక్కులప్ప, నారాయణస్వామి, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు స్థలం, ఇళ్లు మంజూరు చేయాలి

సిఐటియు నాయకులు ఉమాగౌడ్, రామ్మోహన్

ప్రజాశక్తి-తాడిపత్రి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీడీ కార్మికులు, సిఐటియు నాయకులు

తాడిపత్రిలో ఏళ్ల తరబడి దుర్భర జీవితం అనుభవిస్తున్న బీడీ కార్మికులకు స్థలాలతోపాటు ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని సిఐటియు నాయకులు ఉమాగౌడ్, రామ్మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం తాడిపత్రిలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులతోపాటు ఎపి బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అరీఫా, రహీంబి మాట్లాడుతూ తాడిపత్రిలో దాదాపు 4000 మందికిపైగా కార్మికులు బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కార్మికులకు వెయ్యి బీడీలకు కేవలం రూ.200 మాత్రమే కూలి ఇస్తున్నారన్నారు. పెరిగిన జీవన ఖర్చుల నేపథ్యంలో ఈ కూలి ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ఈనేపథ్యంలో బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాల కేటాయించడంతోపాటు గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. కావున మీరైనా స్పందించి బీడీ కార్మికులకు . ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు

పుట్లూరు : బాధితుల పైన కేసు నమోదు చేశారని సోమవారం అనంతపురంలోని ఎస్పీ కార్యాలయంలో పలువురు బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కడవకల్లు గ్రామానికి చెందిన పిదప తనూజ ఈనెల 14న ఇంటి ముందు దుస్తులు ఉతుకుతుండగా హోంగార్డు రాజశేఖర్ మోటార్ సైకిల్‌లో వెళ్తూ ఆమెకు తగిలాడు. దీంతో ఆమె చూసుకుని వెళ్లాలని హోంగార్డుకు సూచించింది. ఇందుకు హోంగార్డు స్పందిస్తూ తనకే చెబుతావా.. అంటూ దాడి చేశాడన్నారు. వెంటనే విషయాన్ని తన భర్త మధుసూదన్ రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో ఆయన ఇంటికి వచ్చి 100కు డయల్ చేయడంతోపాటు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి హోంగార్డు రాజశేఖర్‌పై ఫిర్యాదు చేశారు. అయితే ఎస్ఐ మాత్రం తమపైనే కేసు నమోదు చేశారని ఎస్పీ ఎదుట వాపోయారు.

నూతన ప్రింటర్లు పంపిణీ

యల్లనూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రభుతం మంజూరు చేసిన నూతన ప్రింటర్లను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి కంప్యూటర్లకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎపిఒ సత్యమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని మార్చిన అధికారులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

మరమ్మతులు చేస్తున్న కరెంటు సిబంది

పామిడి : మండల కేంద్రంలోని సుదర్శన్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని అధికారులు సోమవారం మార్చారు. ఆదివారం ప్రజాశక్తి పత్రికలో 'పొంచి ఉన్న ప్రమాదం' అన్న శీర్షికతో ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు వంగిపోయిన విద్యుత్ స్తంభాన్ని సరిచేశారు.

విలేకరి మృతికి నివాళి

ఉరవకొండ : నియోజకవర్గ హెచ్ఎం టివి విలేకరి నాగరాజు మృతికి డిసిసి అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి సోమవారం నివాళులర్పించారు. ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హెచ్ఎం టివి విలేకరి నాగరాజు మృతిచెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న వై.మధుసూదన్‌రెడ్డి మృతుని స్వగ్రామం బూదగవికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు.

నివాళులర్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి

ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా సమితి కార్యదర్శి ఎన్.రాజశేఖర్

ప్రత్యేక ఉపకారాగారం తనిఖీ

గుత్తి : ప్రత్యేక ఉపకారాగారాన్ని అనంతపురం జిల్లా న్యాయ సేవా సమితి కార్యదర్శి ఎన్.రాజశేఖర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జైలు వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జైలులోని రికార్డులతోపాటు వంటగది, స్టోర్ గది, బ్యారెకులు, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశమయ్యారు. జైలు ఆవరణలో కంపోస్ట్ యార్డులు ఏర్పాటు చేయాలని జైలు సూపరింటెండెంట్ వి.మహేశ్వరుడుకు సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ విసి.గంగాధర్ కుమార్, కోర్టు టైపిస్ట్ ఎస్.సాదిక్ వలి, సిబ్బంది పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో మోటారుకు మరమ్మతులు

మోటార్లను రిపేరి చేయిస్తున్న అట్టే రామాంజనేయులు

శింగనమల : మండల పరిధిలోని శోదనపల్లి గ్రామంలో మాజీ సర్పంచు అట్టే రామాంజనేయులు సొంత నిధులు వెచ్చించి తాగునీటి మోటారును రిపేరి చేయించారు. గ్రామంలో గతేడాది కిందట ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద ఉచిత ఫిల్టర్ వాటర్ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకూ ఎలాంటి ఇబ్బంది కలగకుండా మంచినీరు ఉచితంగా సరఫరా చేశారు. అయితే గత ఆదివారం మోటార్లు చెడిపోవడంతో అట్టే రామాంజనేయులు రూ.12,500 వెచ్చించి మోటారు రిపేరు చేయించారు. దీంతో మండల పరిధిలోని గోవిందరాంపేట, పోతురాజుకాలవ, శోధనపల్లి మూడు గ్రామాల ప్రజలు, హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యోగాలో పాల్గొనేందుకు పేరు నమోదు చేసుకోండి

పుట్లూరు : రాష్ట్ర ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకూ నిర్వహించనున్న యోగాసనాల్లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపిడిఒ అలివేలమ్మ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో యోగాలో పాల్గొనేందుకు క్యూఆర్ కోడ్ ద్వారా దరఖాస్తు చేస్తున్న వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్య, సచివాలయం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోండి

ఫారంపాండ్ భూములకు భూమిపూజ చేస్తున్న దేగల కృష్ణమూర్తి, సర్పంచు లలితమ్మ

శింగనమల : ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్న పనులను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, సర్పంచు దేగల లలితమ్మ సూచించారు. సోమవారం మండలంలోని గుమ్మేపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న ఫారంపాండ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు శ్రావణశ్రీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో అత్యధికంగా కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు.

మహానాడును విజయవంతం చేద్దాం

శింగనమల : కడపలో ఈనెల 27, 28, 29వతేదీల్లో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యదర్శి మాసూలు చంద్రమోహన్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. టిడిపి ఆవిర్భావం తర్వాత కడపలో మహానాడు నిర్వహించడం ఇదే మొదటిసారి అన్నారు. దీనికితోడు చంద్రబాబు 75 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మహానాడుకు మరో ప్రత్యేకత ఉందన్నారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాది కాలంలో అనుకున్న దానికంటే సీఎం చంద్రబాబు మెరుగైన పాలన అందించారన్నారు. ఈ సమయంలో జరుగుతున్న మహానాడు కార్యక్రమంలో పార్టీ వ్యవహారాలు, ప్రభుత్వ నిర్ణయాలు, పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలపై సమగ్ర చర్చించనున్నట్లు తెలిపారు.

బకాయిలు ఇప్పించాలని వినతి

కళ్యాణదుర్గం రూరల్ : ప్రభుత్వ నుంచి రావాల్సిన బకాయిలు ఇప్పించాలని పలువురు విశ్రాంత ఉద్యోగులు కోరారు. ఈమేరకు స్థానిక కార్యాలయంలో ఆర్‌డిఒ వసంతబాబును కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ తిప్పేస్వామి రిటైర్డ్ ఎస్ఐ కృష్ణమూర్తి, సీసీ రెడ్డి, ప్రిన్సిపాల్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

యోగా తరగతులకు హాజరుకండి

బొమ్మనహాల్ : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో పని చేసే సిబ్బంది యోగా తరగతులకు హాజరుకావాలని తహశీల్దార్ మునివేలు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహినంచిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వారి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే ఇతరులకు ఆరోగ్య సూచనలు ఇచ్చే స్థాయికి ఎదగాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగా తరగతులకు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ విజయభాస్కర్, వైద్య సిబ్బంది, మండల విద్యాధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో రోగులపై నిర్లక్ష్యం : సిపిఎం

పెద్దవడుగూరు : ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులపై అసభ్యంగా ప్రవర్తిన్న స్టాఫ్‌నర్సు ఖైరున్నీసాపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఉప తహశీల్దార్ వెంకటేశ్వరమ్మకు సిపిఎం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి, రైతుసంఘం అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, నాయకులు మస్తాన్, మల్లికార్జున, బాబయ్య, ఓబిరెడ్డి, తదతరులు పాల్గొని మొదట ఆసుపత్రికి వెళ్లి పరిశీలించి ఆమె విధుల్లో రోగులపై ప్రవర్తించే తీరు సాటి మానవున్ని విస్తుగొలిపేలా ఉందని ఇక్కడి ఆసుపత్రికి ఎంతోమంది రోగులు వస్తుంటారు వైద్యసేవలు అందించకుండా వారిపై విసుగుకుని దుర్భషలాడుతోందన్నారు. ప్రజలకు సేవ చేయడానికే ఆమెకు ప్రభుత్వం వేతనం ఇస్తున్నది కాబట్టి ఇలాప్రవర్తించిన ఆమెపై చర్యలు తీసుకోకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుత్తి : ప్రభుత్వాసుపత్రిలో సోమవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఇతను ఇటీవల గుత్తిలోని స్వస్థతశాలకు వచ్చాడు. తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకుని బయటికి వచ్చి అక్కడ ఉన్న బల్లపై కూర్చొని ప్రాణాలు విడిచాడు. ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

మృతిచెందిన వ్యక్తి